19 జూలపల్లి-పెద్దాపూర్ గ్రామాల మధ్య వాగుపై ఉన్న వంతెన

వానకాలం మునుగుడే..

- వరదలకు నీట మునుగుతున్న వంతెనలు
- రాకపోకలు బంద్
- ప్రతియేటా తప్పని తిప్పలు
- శిథిలమైన వంతెనలు, కల్వర్టులు

జూలపల్లి, మే 19 : వానకాలంలో వంతెనలు, కల్వర్టులు నీట మునుగుతున్నాయి. ఏటా ఆయా గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోతున్నాయి. లోలెవల్ వంతెనలు చిన్నపాటి వర్షాలకు నీటి ప్రవాహాలకు కనిపించకుండా పోతున్నాయి. భారీ వర్షాలకు చాలా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో పెద్దపల్లి, కరీంనగర్ పట్టణ ప్రాంతాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. ఏండ్ల తరబడి వంతెనలు, కల్వర్టులు పునర్నిర్మించకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. జూలపల్లి-పెద్దాపూర్, వడ్కాపూర్-ధూళికట్ట మధ్య హుస్సేనిమియా వాగుపై వంతెనలు, జూలపల్లి-వడ్కాపూర్, కోనరావుపేట-ధూళికట్ట, తేలుకుంట-చీమలపేట, కాచాపూర్-వెంకట్రావ్‌పల్లి గ్రామాల మధ్య ఒర్రెలపై కల్వర్టులున్నాయి. కాలక్రమేణా వంతెనలు, కల్వర్టులు పూర్తిగా శిథిలమయ్యాయి. వర్షా కాలంలో మండల కేంద్రం చేరుకోడానికి ఆయా గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నాయి. వాగులు, ఒర్రెలు దాటలేక రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాలు, పశువులు కొట్టుకుపోయిన సందర్భాలున్నాయి. దశాబ్దాల తరబడి వంతెనలు, కల్వర్టులకు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా చెడిపోయాయి. స్థానికులు తాత్కాలిక మరమ్మతులు చేసుకుంటూ రాకపోకలు కొనసాగిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు గోపు అయిలయ్యయాదవ్

బాధిత కుటుంబానికి రూ. 8 లక్షల ఆర్థిక సాయం

పాలకుర్తి, మే19: కేశోరాం సిమెంట్ కర్మాగారంలో సున్నపురాయిగనుల కాంట్రాక్టర్ గొపు అయిలయ్యయాదవ్ వద్ద పనిచేసే కోడిపుంజులరాజు రెండేండ్ల కిత్రం ప్రమాదవశాత్తు లారీకి ందపడి మృతిచెందాడు. అదివారం కేశోరాం కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు సూరసమ్మయ్య సమక్షంలో అయిలయ్య యాదవ్ చర్చలు జరిపి రెండో విడత రూ.8 లక్షల చెక్కు బాధిత కుటుంబీకులకు అందజేశారు. ప్రమాద సమయంలో బాధిత కుటుంబానికి రూ.18 లక్షల పరిహారానికి అయిలయ్యయాదవ్ అంగీకరించారు. మొదటి విడత, గత ఏడాది రూ.7లక్షలు అందజేశారు. ఇంకా రూ. 8 లక్షలు అందజేశాడు. కాగా పరిహారం విషయంలో జాప్యం చేయడంతో గత ఐదురోజులుగా మాజీ సర్పంచ్ ముక్కెర శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గొపు అయిలయ్య వద్ద పనిచేసే డ్రైవర్లు, కార్మికులు సమ్మెకు దిగారు. కార్యక్రమంలో కొడిపుంజుల రాజు కుటుంబసభ్యులు, స్నేహితులు మోహన్‌చారి, పన్నాల శ్రీనివాస్, తిరుపతి, తిప్పని శ్రీనివాస్ ఉన్నారు.

పేద కుటుంబానికి సాయం

కమాన్‌పూర్, మే 19: కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దాసరిపల్లెలో పేద కుటుంబానికి చెందిన దాసరి రాజమ్మ ఇటీవల వడదెబ్బ తగిలి మృతి చెందింది. సుందరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బోనాల వెంకటస్వామి తమ ఫౌండేషన్ సభ్యుల ద్వారా ఆదివారం 25 కిలోల బియ్యం బాధిత కుటుంబానికి అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బోగే రమేశ్, దాసరి శ్రీనివాస్, శేఖర్, ప్రశాంత్ తదితరులున్నారు.

కాటి కాడ కష్టాలే..

- కట్టెలు, డప్పులకు డబ్బు లిస్తేనే దహన సంస్కారాలు
- ఎంత లేదనుకున్నా రూ.20 వేల నుంచి రూ.30వేల దాకా ఖర్చులు
- చేతులెత్తేసిన రామగుండం బల్దియా
- కారడవిని తలపిస్తున్న 'ఖని' శ్మశాన వాటిక

శ్మశాన వాటికలో కరెంట్ లేక సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో అంత్యక్రియలు

కోల్‌సిటీ, మే 19: గోదావరిఖని శివారు గోదావరి వద్ద గల హిందూ శ్మశాన వాటికను సమస్యలు చుట్టుముట్టాయి. కాటి కాడ కూడా కష్టాలే అన్నట్టు మారింది. దురదృష్టవశాత్తు ఎవరైనా చనిపోతే... అక్కడ డబ్బులు చెల్లిస్తేనే దహన సంస్కారాలు జరుగుతాయి. ఎంత లేదనుకున్నా రూ.20వేల నుంచి రూ.30వేల దాకా ఖర్చులు భరించాల్సి వస్తుంది. మొన్నటిదాకా ఉచిత దహన సంస్కారాలు, సకల వసతులతో కనిపించిన శ్మశాన వాటిక ఇప్పుడు నిర్వహణ లోపంతో కారడవిని తలపిస్తున్నది. రామగుండం నగర పాలక సంస్థ చేతులెత్తేయడంతో అక్కడ సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. పుట్టెడు దుఃఖంతో దహన సంస్కారాలకు తీసుకవెళ్లిన బంధువులు తిరిగి అంతకంటే రెట్టింపు దుఃఖంతో ఇంటిదారి పడుతున్నారు. పాత పద్ధతిలోనే ఉచితంగా దహన సంస్కారాలు నిర్వహించాలని స్థానికంగా ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మొన్నటిదాకా...

అంతిమ యాత్ర కూడా ఆత్మగౌరవం చాటేలా గత తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వైకుంఠ ధామాలను సకల వసతులతో నిర్మించింది. దీనిలో భాగంగా గోదావరిఖని శివారు గోదావరి వద్ద గల హిందూ శ్మశాన వాటికను సైతం అదే పద్ధతిలో తీర్చిదిద్దింది. కార్పొరేషన్ పరిధిలో ఎవరైనా చనిపోతే శ్మశాన వాటిక దాకా అంతిమయాత్ర కోసం నాలుగు వైకుంఠ రథాలను కొనుగోలు చేసి బల్దియా కార్యాలయంలో అందుబాటులో ఉంచింది. ఎవరు చనిపోయినా... టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదిస్తే వెంటనే కార్పొరేషన్ ఆధ్వర్యంలో వైకుంఠ రథం ద్వారా అంతిమయాత్ర నిర్వహించేవారు. చివరకు శ్మశాన వాటికలో సైతం దహన సంస్కారాలు పూర్తిగా ఉచితంగా జరిగేవి.

'మార్పు' జరిగిందిలా...

ప్రస్తుతం శ్మశాన వాటిక అధ్వాన్నంగా మారింది. దహన సంస్కారాల కాంట్రాక్ట్‌లో అవకతవకలు జరుగుతున్నాయని బల్దియా కూడా చేతులెత్తేసింది. అక్కడ దహన సంస్కారాలకు దాదాపు రూ.30వేల వరకు ఖర్చు అవుతుండడంతో నిరుపేదలు లబోదిబో మంటున్నారు. అక్కడ దహన సంస్కారాలు నిర్వహించేవారు కొంతమంది గ్రూపులుగా ఏర్పడి కార్పొరేషన్‌లోని 50 డివిజన్లను పంచుకున్నారు. ఒకరి డివిజన్ల పరిధిలో మరొకరు జోక్యం చేసుకోకుండా షరతులు విధించుకున్నారు. దీనితో పలానా డివిజన్‌లో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు పలానా వారే నిర్వహించాల్సి ఉంటుంది. ఇతర సిబ్బంది ఎవరూ జోక్యం చేసుకోరు. దీనితో అక్కడ కట్టెలు, డప్పులు, ఇతర ఖర్చులకు మొత్తంగా దాదాపు రూ.20 వేల నుంచి రూ.30వేల దాకా చెల్లిస్తేనే దహన సంస్కారాలు పూర్తయ్యే పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారంపై గతంలో కార్పొరేషన్‌కు ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు.

పాత పద్ధతినే కొనసాగించాలి

శ్మశాన వాటికలో దహన సంస్కారాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలి. లేదంటే తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి ఉచితంగా నిర్వహించాలి. స్థానిక ఎమ్మెల్యే, కమిషనర్ జోక్యం చేసుకోవాలె. రాత్రి పూట శ్మశాన వాటికలో కనీసం కరెంటు సౌకర్యం కూడా లేదు. చీకట్లోనే సెల్‌ఫోన్ టార్చ్‌లతో దహన సంస్కారాలు చేసుకునే పరిస్థితి నెలకొంది. కొంతమంది గ్రూపులుగా ఏర్పడి చనిపోయిన వారి బంధువుల నుంచి బలవంతంగా రూ.30వేల దాకా వసూలు చేస్తున్నారు. ఏమి లేని నిరుపేదలు ఇంత మొత్తం ఎలా చెల్లిస్తారో ఆలోచించండి. సింగరేణి టింబర్ డిపో నుంచైనా కట్టెలు ఇప్పించాలి. కార్పొరేషన్ వారు చేతులెత్తేయడంతో దహన సంస్కారాలు తలకుమించిన భారంగా మారుతుంది. పేదవారికి కాటికాడ కూడ కష్టాలే ఎదురవుతున్నాయి.

మద్దెల దినేష్, ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు

'పుచ్చలపల్లి' జీవితం స్ఫూర్తిదాయకం

పెద్దపల్లి టౌన్ : సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దపల్లి టౌన్, మే 19: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఎం పెద్దపల్లి ఏరియా కార్యదర్శి సీపెల్లి రవీందర్ అన్నారు. సీపీఎం కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేశారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ నాయకులు జ్యోతి, అశోక్, శ్రావన్, ప్రశాంత్, నవీన్, సతీశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి, మే 19: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జిల్లా కమిటీ సభ్యుడు దొమ్మటి కొమురయ్య హాజరై మాట్లాడారు. ధనిక కుటుంబంలో జన్మించిన సుందరయ్య తన విద్యార్థి దశ నుంచే కుల, మత వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడనీ, జీతగాళ్లతో సహపంక్తి భోజనాలు చేసేవాడని అన్నారు. కమ్యూనిస్టు పోరాటంలో చురుకుగా పాల్గొని నాయకత్వ స్థాయికి ఎదిగాడని అన్నారు. సీపీఎం పార్టీ ఏర్పాటులో కీలక నేతలతో ఒకరని అన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హమిద్ పాషా, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, వేణుగోపాల్, రాజలింగయ్య, మొండయ్య తదితరులున్నారు.

జ్యోతినగర్, మే 19: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం ఎన్టీపీసీలో సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందిరమ్మకాలనీలో తోట రవీందర్, మల్కాపూర్‌లో కుందారపు రాజ్‌కుమార్, అన్నపూర్ణకాలనీలో కదాసి మల్లేశ్ పార్టీ జెండాలను ఆవిష్కరించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇక్కడ సీపీఎం రెండో డివిజన్ కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, నాయకులు పీ నాగలక్ష్మీ, టీ రవీందర్, వీ శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, విజయ్, అజయ్, ఎం సాంబయ్య, సంపత్, రంగారెడ్డి, ఏ రమేశ్, కనకయ్య ఉన్నారు.

ఫర్టిలైజర్‌సిటీ : సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఓదెల: కొలనూర్‌లో 2001-02 బ్యాచ్ విద్యార్థులు

ఒక్కచోట..మధురస్మృతుల కలబోత

- ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

ఫర్టిలైజర్‌సిటీ/రామగిరి/ఓదెల మే 19: 'ఖని'లోని అనిత ప్రైవేట్ స్కూల్‌కు చెందిన 1994-95, ప్రగతి ఉన్నత పాఠశాల 2001-2002, ఓదెల మండలం కొలనూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2001-02 టెన్త్ బ్యాచ్‌ల విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం పేరిట ఒక్కచోట చేరారు. పరస్పరం పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. చదువుకున్న రోజుల్లోని మధుర స్మృతులను పంచుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. చదువుచెప్పిన గురువులను సత్కరించుకున్నారు. సామూహికంగా విందారగించి భారమైన హృదయాలతో బై..బై చెప్పుకుంటూ ఇండ్లళ్లకు వెళ్లిపోయారు.

రామగిరి : సమ్మేళనంలో ప్రగతి పాఠశాల పూర్వ విద్యార్థులు

మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఐ కృష్ణ

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

కోల్‌సిటీ, మే 19: ఆదివాసీలపై బీజేపీ నరహంతక దాడులను ఆపి సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. ఖనిలోని పార్టీ ఆఫీసులో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ఐదు నెలలుగా ఆపరేషన్ కగారు పేరుతో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో 120 మందికిపైగా గిరిజనులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేసిందన్నారు. 16 రాష్ట్రాల్లో విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు బీజేపీ ప్రభుత్వం గిరిజనులపై యుద్ధం ప్రకటించిందనీ, గిరిజనులను అడవి నుంచి వెళ్లగొట్టి ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యం ఉందన్నారు. ఇక్కడ జిల్లా నాయకులు ఈ నరేశ్, వెంకన్న, అశోక్, చిలుక శంకర్, కాదాసి లింగమూర్తి, దుర్గయ్య, కోండ్ర మొగిలి, బుచ్చయ్య, ఎడ్ల రవికుమార్, ఎల్లయ్య, రాజేశం, రాజేందర్, రమేశ్, మల్లేశం ఉన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల సందడి

ఓదెల, మే 19: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ప్రస్తుతం రైతుల యాసంగి వరి కోతలు ముగియడం, విద్యా సంస్థలకు సెలవులు ఉండడంతో భక్తులు, ఇంటిల్లిపాది ఆలయానికి తరలి వచ్చారు. ఆదివారం తెల్లవారుజాము వరకే ఆలయ ఆవరణ భక్తులతో సందడిగా మారింది. ఆలయంలో స్వామి వారికి పసుపు, పిండిలతో ముగ్గుల పట్టి వేసి, బోనంతో మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారిని దర్శించుకుని పిల్లాపాపలతో సల్లంగా ఉండేలా చూడాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

సామూహిక బీమా వర్తింపజేయాలి

ఫర్టిలైజర్‌సిటీ, మే 19: లాయర్లకు సామూహిక బీమా పథకాన్ని వర్తింపజేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఏఐఎల్‌యూ ప్రతినిధి బృందం శనివారం న్యాయశాఖ కార్యదర్శి ఆర్ తిరుపతిని సచివాలయం లో కలిసి వినతిపత్రం అందజేశారు. 2024-25కు గాను కొత్త గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీకి న్యాయవాదుల జాబితాను సరిచేయాలని, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని కోరారు. బీమా పరిమితిని రూ. 2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని విజ్ఞప్తిచేశారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జీ విద్యాసాగర్, అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, కోశాధికారి ఈ వేణుగోపాల్, నాయకులు చందాల శైలజ, ఏడునూతల శ్రీనివాస రావు, మీసాల వెంకటేశ్వర్లు, రమేశ్‌కుమార్, మక్కడ్, కిషన్‌రావు, శంకరయ్య, మంజులత ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్ రూరల్, మే 19: ఆదర్శ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏరువ రఘునాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్మీడియెట్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ,సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపులో 40 చొప్పున 160 సీట్లకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పాఠశాలల్లో ప్రవేశం కోసం www. tsmodel schools. com అనే వెబ్‌సైట్ ద్వారా ఎలాంటి ఫీజు లేకుండా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు గడువు ఈ నెల 31వరకు ఉందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అందుబాటులో జనుము, జీలుగు విత్తనాలు

పెద్దపల్లిరూరల్, మే 18: ప్రస్తుతం వానకాల పంటలకోసం రైతులకు అవసరమయ్యే జనుము, జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పంటల సాగుకు సేంద్రియ ఎరువులుగా వాటిని సాగుకు ముందు వినియోగించుకోవాలని పెద్దపల్లి మండల వ్యవసాయశాఖ అధికారిణి కాంతాల అలివేణి తెలిపారు. ఈమేరకు జనుము జీలుగు విత్తనాలను సోమవారం నుంచి జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ గోదాంలో పంపిణీ చేయడం జరుగుతుందని రైతులు గమనించి సంబంధిత గ్రామాల క్లస్టర్ ఏఈవోలను సంప్రదించడం ద్వారా పట్టాదారు పాసుబుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో 30 కిలోల బస్తాకు రూ.1130ల చొప్పున చెల్లించి తీసుకోవాలని అన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు

ఓదెల, మే 19: వానకాలానికి సంబంధించిన పచ్చిరొట్ట ఎరువులు అయిన జీలుగ విత్తనాలు సబ్సిడీ పై ఓదెల మండలంలో అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఓదెల డీసీఎంఎస్‌లో 167 బస్తాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో కనగర్తి అగ్రోస్, పొత్కపల్లి డీసీఎంఎస్‌లకు పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. బస్తా ధర రూ. 2790కాగా, సబ్సిడీ రూ.1674 పోగా రైతు చెల్లించేది రూ.1116గా తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డ్ తీసుకువెళ్లి డీసీఎంఎస్‌లో సంప్రదించాలని కోరారు. 30కిలోల బస్తా 2.20ఎకరాలకు సరిపోతుందని పేర్కొన్నారు.

పేద కుటుంబాలకు చేయూత

పెద్దపల్లిరూరల్, మే 19: పెద్దపల్లి మండలంలోని మారేడుగొండలో పేద కుటుంబానికి స్థానిక హనుమాన్ భక్త మండలి సభ్యులు ఆర్థిక చేయూతనందించి మానవతను చాటుకున్నారు. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబసభ్యులకు సభ్యులు పోగు చేసిన రూ.5 వేల నగదును అందజేశారు. ఆరగొండ నర్సయ్య, ఆకోజు రుక్కమ్మ, అలాగే గుర్రాంపల్లికి చెందిన లాగల మధుర మ్మలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో హనుమాన్ భక్త మండలి సభ్యులు బుర్ర రమేష్, ఉమ్మల్ల తిరుపతి, గడ్డం రాజయ్య,కండునూరి శ్రీధర్, తమ్మట వేన రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఖని'లో కళాకారుల పండుగ

కళాకారుడిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కోల్‌సిటీ, మే 19: ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ చైర్మన్ దినేశ్ జన్మదినం సందర్భంగా గోదావరిఖనిలో కళాకారుల పండుగ నిర్వహించారు. దుర్గానగర్‌లో ఆదివారం నిర్వహించిన ఖని కళాకారుల సమ్మేళనం పండుగ వాతావారణాన్ని తలపించింది. 70 మంది కళాకారులు ఒకే వేదికపైకి వచ్చి తమ అనుభవాలు పంచుకున్నారు. ప్రజానాట్య మండలి, అరుణోదయ, కళా సంఘాల సమాఖ్య, సింగరేణి కళాకారుల ఐక్య వేదిక, సారథి సంఘాల తరపున పాత, కొత్త తరం కళాకారులు హాజరు కాగా, పలువురు మాట్లాడుతూ గోదావరిఖని అంటేనే కళలకు, కళాకారులకు పుట్టినిల్లు అని, ఇక్కడ కళారంగంను సంపన్నం చేశారన్నారు. ఇక్కడ కే.స్వామి, మేజిక్ రాజా, డా.రంగ జ్యోతి, ఇ.పద్మ, జక్కని శ్రీలత నేత, పోచం, రాజన్న, శంకర్, రమ, గీత, రాజనర్సు, చీకటి అంజన్న, రాజమౌళి, జనగామ రాజనర్సు, సతీశ్‌కుమార్, శంకర్, రవి, మోహన్, మేదరి శ్రీనివాస్, చందు యాదవ్, మానస్ కుమార్, ప్రసాద్, రాజేందర్, నరేందర్ ఉన్నారు.

రక్తదాన శిబిరం

పాలకుర్తి, మే19: కరెంట్‌షాక్‌తో మరణించిన బసంత్‌నగర్‌కు చెందిన కొమ్మహరీశ్ స్మారకార్థం కుటుంబసభ్యులు, స్నేహితులు, ఆలయఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం బసంత్‌నగర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ, ఆలయఫౌండేషన్ల సహకారంతో ఏర్పాటు చేసిన క్యాంపులో హరీశ్ స్నేహితులు, ఫౌండేషన్ వలంటీర్లు 37మంది ఉచితంగా రక్తదానం చేశారు. ఇక్కడ ఆలయ ఫౌండేషన్ ప్రతినిధులు పరికిపండ్ల రాము, రాజేందర్, రమేశ్, ఐతశివ, నాగార్జున, వెంకటేశ్, సుందర్, బార్గవ్, హరీశ్ స్నేహితులు అట్లశ్రీనివాస్,రంజిత్, రమేశ్, సతీశ్ ఉన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్

ఫర్టిలైజర్‌సిటీ, మే 19: నకిలీ విత్తన రవాణా, విక్రయాన్ని అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ తెలిపారు. కొందరు డీలర్లు ధనార్జనే ధ్యేయంగా రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు నకిలీ, కల్తీ విత్తనాల స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్ పరీక్షలు నిర్వహిస్తామని, అక్రమార్కులపై పీడియాక్ట్ అమలు చేస్తామని స్పష్టంచేశారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

జ్యోతినగర్, మే 19: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను ఆదివారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని వీఐపీ గెస్ట్ హౌస్‌లో ట్రస్మా, వాక్ వెల్ఫేర్ అసోసి యేషన్ ఘనంగా సన్మానించింది. న్యూ ఢిల్లీ నుంచి ఎన్టీపీసీకి వచ్చిన ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఇక్కడ వాక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ కరస్పాడెంట్ రామగుండం కన్వీనర్ అరకాల రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షు డు కంది రవీందర్‌రెడ్డి, పరిపాటి అంజు, విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందా రపు యాదగిరిగౌడ్, తిరుపతిగౌడ్, బం డారి రాయమల్లు, అడపబాపురెడ్డి, సింహాచలం రత్నాకర్, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్ గౌడ్, కృష్ణ ఉన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం

ధర్మారం,మే19: ఖిలావనపర్తిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 17 నుంచి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సం అర్చకులు ఘనంగా నిర్వహిం చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తిలకించారు.ఆలయ ఈవో కాంతారెడ్డి,గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194